గెలుపే లక్ష్యంగా సమష్టిగా పని చేద్దాం

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మొయినాబాద్, ఫిబ్రవరి15 : రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా సమష్టిగా పని చేద్దామని బీఆర్ఎస్ మండల నూతన అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నూతన మండల అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా శనివారం చిన్నమంగళారం, వెంకటాపూర్ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు ఆయనను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలు ఎప్పుడొచ్చినా పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేసేందుకు సన్నద్ధం కావాలన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే వాటి అమలు కోసం మాజీ మంత్రి సబితారెడ్డి నాయకత్వంలో పని చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎం.వెంకటేశ్, బి.శంకరయ్య, తలారి రాజు, ఆసిప్, కుమ్మరి జనార్దన్, వడ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం

బదిలీపై వెళ్తున్న పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ రాధికను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 15 : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. పాలశీతలీకరణ కేంద్రంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న రాధిక బదిలీపై రావిర్యాలలో ఉన్న మెగా డెయిరీకి వెళ్లారు. ఈ సందర్భంగా శనివారం పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాధికను బీఆర్ఎస్ శ్రేణులు సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పాలశీతలీకరణ కేంద్రం అభివృద్ధికి ఆమె విశేషంగా కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో షాద్‌నగర్ డీడీ శివాల్కర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, రైతు సంఘం జిల్లా డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు రామచంద్రయ్య, రాములుయాదవ్, రమేశ్, నాగార్జున్, ఎంసీసీ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న ఏసీపీ రాజు తదితరులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 15 : దివ్యాంగుల సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. ఇబ్రహీంపట్నంలో ఏసీపీగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ముగ్గురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను ఏసీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. యువత చెడు మార్గాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, నాయకులు వెంకటేశ్, సలీం, బాలరాజు, నర్సింహ, పాండు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : కొత్తూరు తండాలో జరిగిన సేవాలాల్ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

సేవాలాల్ ఆదర్శప్రాయుడు

గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అన్నారు. రంగారెడ్డి జిల్లాలో శనివారం సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ గిరిజనుల అభ్యున్నతి కోసం చేసిన సేవలను కొనియాడారు. అంతకుముందు ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్, రంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 15

షాద్‌నగర్‌టౌన్ : తండాలో సేవాలాల్ జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

యాచారం : సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న గిరిజనులు

కొందుర్గు : సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నేతలు

షాబాద్: పోతుగల్ తండాలో సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాద్‌నగర్‌టౌన్ : సేవాలాల్ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

ఆమనగల్లు : సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి



మంచాల : లోయపల్లిలో సంత్ సేవాలాల్ విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న అధికారులు, గిరిజన సంఘం నాయకులు

కేశంపేట : బోగ్ బండార్‌లో సేవాలాల్ జయంతి వేడుకలో పాల్గొన్న అధికారులు, నేతలు

జీఐసీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా రాజశేఖర్

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 15: గ్రీన్ ఇండియా ఛాలెంజ్ (జీఐసీ) షాద్‌నగర్ నియోజకవర్గ కో- ఆర్డినేటర్‌గా పట్టణానికి చెందిన తమగొండ రాజశేఖర్ ఎన్నికయ్యారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఫౌం డర్, మాజీ ఎంపీ సంతోశ్ కార్యాలయం నుంచి శనివారం తనను నియమించినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఫౌండర్, మాజీ ఎంపీ సంతోశ్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వే చేయని కుటుంబాలకు మరో అవకాశం

మొయినాబాద్, ఫిబ్రవరి 15 : రాష్ట్ర ప్రభుత్వం సోసియో ఎకనామిక్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ పొలిటికల్ సెన్సెస్ సర్వేకు మరోసారి అవకాశం ఇచ్చిందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సంధ్య ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో సర్వే చేసిన సమయంలో ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు తాళం వేసి ఉన్న వారికి మరో అవకాశం ఇచ్చిందని తెలిపారు. జిల్లా స్తాయిలో ఉండే టోల్ ఫ్రీ నంబర్ 040-211111 నంబర్‌కు కాల్ చేసి సర్వే చేసుకోవాలని తెలిపారు. ఈ సర్వే ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆమనగల్లు : సీపెక్ సర్వేలో పాల్గొనని వారి కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించినట్లు ఎంపీడీవో కుసుమ మాధురి, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సీపెక్ సర్వే ఈ నెల 16 నుంచి 28 వరకు జరుగుతున్నట్లు వారు తెలిపారు. కాల్ సెంటర్‌కు కాల్ చేసి ఆన్‌లైన్‌లో ఫారం డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేసి ప్రజాపాలన సేవా కేంద్రంలో ఇవ్వాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

షాబాద్, ఫిబ్రవరి 15: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ కోటేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నీటి ఎద్దడి రాకుండా చూడాలి

ఆదిబట్ల : సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బాలకృష్ణ

ఆదిబట్ల, ఫిబ్రవరి 15 : ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో రానున్న వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. శనివారం ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయంలో రంగారెడ్డి కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక హెచ్ఎండబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఈఈ స్వర్ణకుమార్, మిషన్ భగీరథ డిప్యూటీ ఈఈ వినయ్‌కుమార్, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ నిర్మల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ : ప్రజలకు సరఫరా చేసే తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మంచినీటి సరఫరా, వీధి లైట్లు, వాటి నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇమ్రాన్, మున్సిపల్ అధికారులు జమీల్, సంధ్య, వెంకటయ్య, సుదర్శన్, వెంకటేశ్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాచారం : వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచాల : గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. మంచాల మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో ఉమారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

షాబాద్ : ప్రజలు మిషన్ భగీరథ తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఎంపీడీవో అపర్ణ అన్నారు. మండల పరిషత్తు కార్యాలయం సమావేశ మందిరంలో తాగునీటి సమస్యలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో చేవెళ్ల గ్రిడ్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ ఏఈ చంద్రమోహన్, గ్రిడ్ ఏఈ ప్రపుల్‌కుమార్, విద్యుత్‌శాఖ ఏఈ కోటేశ్వర్‌రావు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల రూరల్ : తాగు నీటి సమస్య నివారణకు చర్యలు తీసుకోవాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్ అన్నారు. శంకర్‌పల్లి మండల ప్రజా పరిషత్ సమావేశం శనివారం ఎంపీడీవో వెంకయ్య గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఈలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మభిక్షానికి ఘననివాళి



ఇబ్రహీంపట్నం : ధర్మభిక్షం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 15 : బొమ్మగాని ధర్మభిక్షంను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ అడ్వకేట్ రాములు, గౌడ సంఘం నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, తాళ్ల మహేశ్‌గౌడ్ అన్నారు. శనివారం బొమ్మగాని ధర్మభిక్షం జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గరిగె శేఖర్‌గౌడ్, ప్రవీణ్, జగన్ పాల్గొన్నారు.

మొయినాబాద్ : ధర్మభిక్షం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుర్పిస్తున్న నాయకులు

మొయినాబాద్ : విప్లవయోధుడు బొమ్మగాని ధర్మభిక్షం ఆశయ సాధన కోసం పని చేయాల్సిన అవసరం ఉందని గీతా పని వార్ల సంఘం రాష్ట్ర నాయకుడు కాసుల సురేందర్‌గౌడ్, టీడీపీ చేవెళ్ల పార్లమెంటు ఇన్‌చార్జి కాసుల సుభాన్‌గౌడ్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ గీత పని వార్ల సంఘం వ్యవస్థాపకులు ధర్మభిక్షం జయంతి వేడులకను శనివారం సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం కౌన్సిల్ సభ్యులు సుధాకర్‌గౌడ్, మండల అధ్యక్షుడు బాలరాజుగౌడ్, నాయకులు మల్లేశ్, రాములు, పాండు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

మొయినాబాద్, ఫిబ్రవరి 15 : కాంగ్రెస్ నేతలు ఎన్నికల సమయంలో గ్రామీణ వైద్యులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆర్ఎంపీ, సీఎంపీ, సీపీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సతీశ్‌కుమార్ అన్నారు. ఆర్ఎంపీ, సీఎంపీ, సీపీల సమస్యలను పరిష్కరించనందుకు నిరసనగా ఈ నెల 18న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఏర్పాటు చేయనున్న బహిరంగ సభకు సంబంధించి కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సభకు గ్రామీణ వైద్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ, సీఎంపీ, సీపీ సంఘాల ఐక్యవేదిక మండల అధ్యక్షుడు రామచందర్, ఉపాధ్యక్షుడు జగన్, ప్రధాన కార్యదర్శి మహిపాల్, కోశాధికారి ప్రభాకర్, కార్యదర్శి వీరనందమ్‌చారి, సభ్యులు చంద్రచారి, నందరామ్, చంద్రచారి, నందారామ్ పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లో సంఘం కరపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

చలివేంద్రంతో బాటసారులకు మేలు

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవేందర్‌యాదవ్

కొత్తూరు, ఫిబ్రవరి 15: చలివేంద్రంతో బాటసారులకు మేలు జరుగుతుందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవేందర్‌యాదవ్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలోని ఎస్‌బీ హెచ్ వద్ద సోనూసుద్ ఫౌండేషన్, సీతాఫల్ మండి కార్పొరేటర్ సామ హేమ సహకారంతో బైండ్ల శివ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చలింద్రం ఏర్పాటుతో వేసవిలో ప్రయాణికులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొస్గి శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌గౌడ్, నాయకులు జె శ్రీనివాసుగౌడ్, గోపాల్‌గౌడ్, లక్ష్మయ్య, ప్రభాకర్ రెడ్డి, తుప్పర రవి, శ్రవణ్‌కుమార్, శివచారి, రాఘవేందర్‌యాదవ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి

మాల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

యాచారం, ఫిబ్రవరి 15 : ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు బ్రహ్మయ్య, చందునాయక్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మాల్ మార్కెట్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్ల బతుకులు రోడ్డున పడ్డాయన్నారు. ఎన్నికల ముందు ఆటో డ్రైవర్లకు అండగా ఉంటామని ఇచ్చిన హామీని ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.12వేలు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తాం



అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్లను అందజేస్తున్న బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సీహెచ్ మహేశ్

కడ్తాల్, ఫిబ్రవరి 15 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సీహెచ్ మహేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రానికి రూ.3వేల విలువ చేసే రెండు సీలింగ్ ఫ్యాన్లను స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని చిన్నారులు ఇబ్బందులు పడొద్దని ఫ్యాన్లను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు హెచ్ఆర్ మహేశ్, అంగన్‌వాడీ టీచర్లు మంగమ్మ, జ్ఞానేశ్వరి, ఆయాలు పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 15 : చేవెళ్ల డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శనివారం చేవెళ్లలో సీపీఎం పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లు పూర్తిగా ధ్వంసం కావడంతో వాటి నుంచి వచ్చే దుమ్ము, ధూళితో కంటి చూపు కోల్పోవడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్ల మరమ్మతులకు రూ.10కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే ప్రకటించారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, ట్రాన్స్ పోర్టు యూనియన్ చేవెళ్ల మండల అధ్యక్షుడు కిష్టయ్య, ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, వెంకటయ్య, సురేశ్, మాల సురేశ్, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్టు

ఆమనగల్లు, ఫిబ్రవరి 15 : పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెడికల్ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు పాపిశెట్టి రాము ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు టాలెంట్ టెస్టు ప్రశ్నపత్రాలు అందజేశారు. విద్యార్థుల్లో ఉన్న భయాన్ని తొలగించి ప్రతిభను వెలికి తీసేందుకే ఈ టెస్టు నిర్వహిస్తున్నామని టీఎస్ఎస్‌వో రాష్ట్ర కోఆర్డినేటర్ కర్రె సుదర్శన్ అన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎస్‌వో రాష్ట్ర కోఆర్డినేటర్ కర్రె సుదర్శన్, నాయకులు శంకర్, శివశంకర్, శర్మ, శివలింగం, శ్రీరామ్, నరేశ్, శ్రీశైలం, రమేశ్, పాఠశాల ఉపాధ్యాయులు నరేశ్ తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌ను సన్మానించిన ఫాస్టర్లు



మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఫాస్టర్లు

కేశంపేట, ఫిబ్రవరి 15 : క్రైస్తవ సమాజానికి క్రిస్మస్ సందర్భంగా తన వంతు కృషి చేసిన పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డిని షాద్‌నగర్ ఫాస్టర్ల సంఘం నేతలు శనివారం సన్మానించారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో ఉన్న మాజీ సర్పంచ్ నివాసంలో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ వెల్ఫేర్ ప్రెసిడెంట్ స్వామిదాస్, వైస్ ప్రెసిడెంట్ తిమోతి, ప్రధాన కార్యదర్శి కృష్ణపాల్, దాసు, గ్రామ సీనియర్ నాయకుడు తాండ్ర కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శుభ్రత పాటించకుంటే చర్యలు తప్పవు

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 15 : శంకర్‌పల్లి పట్టణ పరిధిలోని హోటళ్లు, బేకరీల యజమానులు శుభ్రత పాటించకుంటే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ యోగేశ్ అన్నారు. శనివారం శంకర్‌పల్లిలోని పలు హోటళ్లు, బేకరీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యతలేని, కాలం చెల్లిన ఆహార పదార్థాలు ఉపయోగిస్తున్న వాటికి ఫైన్ విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. హోటళ్ల యజమానులు శుభ్రతతో పాటు నాణ్యమైన, కాలం చెల్లని పదార్థాలను వినియోగించాలని, లేనిపక్షంలో చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. కమిషనర్ వెంట మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.